కూల్ కూల్.. స్విమ్మింగ్ పూల్

• సమ్మర్‌లో శిక్షణకు పెరుగుతున్న డిమాండ్ • ప్రోత్సాహం అందిస్తున్న సింగరేణి సంస్థ





సందడిగా స్విమ్మింగ్ పూల్

కోల్‌సిటీ: వేసవి తాపం నుంచి ఉపశమనం పొందడానికి, శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవడానికి, విపత్కర సమయాల్లో ఆత్మరక్షణకు ఉపయోగపడే స్విమ్మింగ్‌పై ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం వేసవి సెలవుల్లో స్విమ్మింగ్ నేర్చుకోవడంపై పిల్లలు దృష్టిసారించారు. స్విమ్మింగ్ పూల్‌లో హాయిగా ఈత కొడుతూ మండుటెండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల్లో నెలకొన్న భయాన్ని, ఆందోళనను దూరం చేస్తూ.. వారికి స్విమ్మింగ్ నేర్పించడానికి కృషి చేస్తున్నారు. అటు పిల్లలు, ఇటు పెద్దల ఉత్సాహాన్ని దృష్టిలో ఉంచుకొని గోదావరిఖనిలోని సింగరేణి సంస్థ చాలా ఏళ్లుగా సుశిక్షితులైన కోచ్‌లతో పిల్లలకు, పెద్దలకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇస్తోంది.

సందడిగా 'ఖని' స్విమ్మింగ్ పూల్..

గోదావరిఖని గాంధీనగర్‌లోని సింగరేణి సంస్థకు చెందిన స్విమ్మింగ్ పూల్‌కు తాకిడి భారీగా పెరిగింది. పిల్లలు, పెద్దలు స్విమ్మింగ్ పూల్ బాట పడుతున్నారు. పిల్లలు, వారి తల్లిదండ్రులతో స్విమ్మింగ్ పూల్ పరిసరాలు సందడిగా మారాయి.

ఈతతో ఆరోగ్య ప్రయోజనాలు..

ఈత శరీరానికి విశ్రాంతిని ఇచ్చే వ్యాయామం. స్విమ్మింగ్ అనేది కార్డియో వ్యాయామం. ఈత కొట్టేటప్పుడు పాదాలు నిరంతరం కదులుతాయి. చేతులు, భుజాలకు కూడా బలాన్ని చేకూర్చి, కండరాలను టోన్ చేస్తుంది. ఈత శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంచడంలో సాయపడుతుంది. గుండె, రక్తపోటును నియంత్రిస్తుంది. గుండె, శ్వాసకోశ వ్యవస్థను బలోపేతం చేస్తుంది. ఊపిరితిత్తులను బలంగా చేస్తుంది. ఈత కొట్టడంతో చాలా రిలాక్స్‌గా అనిపిస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది.

స్విమ్మింగ్‌లో రకాలు..

ఫ్రీస్టైల్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్, బటర్‌ఫ్లై స్ట్రోక్, బ్యాక్ స్ట్రోక్, సైడ్ స్ట్రోక్, ఎలిమెంటరీ బ్యాక్ స్ట్రోక్.

ఇవి తప్పనిసరి..

స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లే ముందు, తర్వాత స్నానం చేయాలి. స్విమ్మింగ్ పూల్‌లోకి వెళ్లినప్పుడు తప్పనిసరిగా క్యాప్ ధరించాలి. ఇయర్ బడ్స్ కూడా పెట్టుకోవచ్చు. చెవిలోకి నీరు పోకుండా కాపాడుతాయి. చిన్నపిల్లలు బెలూన్ల సాయంతో ఈత కొలనులోకి దిగాలి.



స్విమ్మింగ్‌లో మెలకువలు నేర్పిస్తున్న కోచ్

పిల్లలకు ప్రత్యేక శిక్షణ



స్విమ్మింగ్ చేయడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇది శరీరానికి చక్కటి వ్యాయామం. శారీరక, మానసిక ఆరోగ్యానికి దోహదపడుతుంది. శిక్షణ ఇవ్వడానికి ముందు పిల్లలకు, పెద్దలకు జాగ్రత్తలు, ఈత కొట్టే పద్ధతిపై అవగాహన కల్పిస్తున్నాం. పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక బ్యాచ్‌లు నిర్వహిస్తున్నాం. – ఆరె శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్, గోదావరిఖని

సింగరేణి ప్రోత్సాహం గొప్పది



స్విమ్మింగ్ శిక్షణకు సింగరేణి సంస్థ అందిస్తున్న సహకారం గొప్పది. నాకు సింగరేణి సంస్థ గుజరాత్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లోని స్విమ్మింగ్ విభాగంలో డిప్లొమా కోర్సు చేయించింది. స్విమ్మింగ్ కోచ్‌గా, వ్యవహరిస్తూనే, స్విమ్మింగ్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా సెక్రటరీగా వ్యవహరిస్తున్నాను. తక్కువ ధరలోనే సింగరేణి సంస్థ కార్మిక పిల్లలతోపాటు బయటి పిల్లలకు కూడా స్విమ్మింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తుంది. – టి.కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా సెక్రటరీ, స్విమ్మింగ్ అసోసియేషన్

గ్రంథాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తాం



సమావేశమైన రఘువీర్‌సింగ్, సభ్యులు

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గ్రంథాలయాలకు సొంత భవనాలు నిర్మించేందుకు అవసరమైన చర్యలు చేపట్టామని, వచ్చే నెల మొదటివారంలో పనులు ప్రారంభిస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పాలకమండలి సమావేశం శనివారం నిర్వహించారు. గ్రంథాలయాలకు సొంత భవనాలు లేక ఎన్నడో నిర్మించిన భవనాలతో పాఠకులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సొంత భవనాలను జిల్లాకు చెందిన మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సహకారంతో నిర్మించేందుకు చర్యలు చేపట్టామన్నారు. జిల్లాకేంద్రమైన పెద్దపల్లి గ్రంథాలయాన్ని జూనియర్ కాలేజీలో రూ.కోటితో నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలాగే జూలపల్లిలో రూ.50లక్షలతో లైబ్రరీని కాలేజీలో, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, కమాన్‌పూర్ లైబ్రరీ జెడ్పీహైస్కూల్‌లో, ధర్మారంలో దాతలు ఇచ్చిన స్థలంలో కొత్త భవనాలు రూ.40లక్షల వ్యయ అంచనాలతో నిర్మిస్తామని వెల్లడించారు. డైరెక్టర్లు రాజు, గట్టయ్య, కార్యదర్శి సరిత, ఎంఈవో సురేందర్‌కుమార్, శ్రీనివాస్, ఖదీర్ పాల్గొన్నారు.

నేడు మక్కల కొనుగోలు కేంద్రం ప్రారంభం

సుల్తానాబాద్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఆదివారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ కార్యదర్శి బూరుగు సంతోష్ తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి హాజరుకానున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

పెద్దపల్లి అభివృద్ధికి కృషిచేస్తా



పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

పెద్దపల్లిరూరల్: పట్టణాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. పట్టణంలోని 28వ వార్డులో శనివారం రూ.8.13లక్షల వ్యయ అంచనాలతో చేపట్టిన సీసీరోడ్డు, డ్రైనేజీ పనులను కౌన్సిలర్ తూముల సుభాష్‌రావుతో కలిసి ప్రారంభించారు. కమిషనర్ శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనుల పర్యవేక్షణ



పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్, అబ్బాపూర్ గ్రామాల్లో శనివారం మండల అభివృద్ధి అధికారి వేణుగోపాలరావు ప్రత్యేక పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రైడేను పాటించాలని సూచించారు. వడ్కాపూర్, బాలరాజుపల్లె గ్రామాల్లో ఎంపీవో కిరణ్ పారిశుధ్య పనులను పరిశీలించారు. సర్పంచ్‌లు ఈర్ల మల్లేశం, భారతి జ్యోతిబసు, తిరుపతి, రాజయ్య, కార్యదర్శులు అర్చన, పున్నమయ్య, కారోబార్లు మల్లేశం, శ్రీనివాస్ ఉన్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ల వేతనాల ఒప్పందం ఖరారు

జ్యోతినగర్: ట్రాక్టర్ డ్రైవర్ల వేతన ఒప్పదం కుదరడంతో శనివారం సమ్మె విరమించారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ట్రాక్టర్ డ్రైవర్లు వేతన ఒప్పందం అంశంపై సమ్మె బాట పట్టారు. దీంతో కాంట్రాక్టర్లు, యజమానులు, యూనియన్ నాయకుల మధ్య పరస్పర వేతన ఒప్పందం అమలు విషయంపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం వేతన ఒప్పందంపై వివరాలతో కూడిన విషయాలను ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో వేతనం నెలకు రూ.13,330 నుంచి నేడు రూ.15,100కు పెరుగుతున్నట్లు తెలిపారు. వేతన ఒప్పందం పెంపుదలతో పాటు గతంలో పొందుతున్న లీవులు, బోనస్ సర్వీస్‌పే, సేఫ్టీ కింద ఒక జత బట్టలు, ఒక జత బూట్లతో పాటు మిగతావన్నీ ఎప్పటిలాగే కొనసాగాలని ఒప్పందం కుదిరింది. వేతన ఒప్పందం ఈనెల 1 నుంచి అమలులోకి రానున్నట్లు తెలిపారు. చర్చల్లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.రాజన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేశ్, ఉపాధ్యక్షుడు చిలుక శంకర్, కాంట్రాక్టర్లు ఏబీసీ శ్రీనివాసరెడ్డి, దాడి శ్రీనివాస్, రాజేశం, ఏలిని నారాయణ, యజమానులు అంజన్న, శ్రీనివాస్, శివ, రాజేందర్, మహేశ్ పాల్గొన్నారు.


వానాకాలం జాగ్రత్తలపై సమావేశం

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో వానాకాలం తలెత్తే ఇబ్బందులను గుర్తించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శానిటేషన్ విభాగం అధికారులతో శనివారం ప్రత్యే క సమావేశం నిర్వహించారు. వర్షపు నీటితో ఏర్పడే ఇబ్బందులను గుర్తించి వాటి పరిష్కారానికి చేపట్టా ల్సిన పనులపై చర్చించారు. మేనేజర్ శివప్రసా ద్, ఏఈ సతీశ్, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

రెండు బైక్‌లు చోరీ

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో శనివారం తెల్లవారుజామున రెండు బైక్‌లు (పల్సర్, హీరోహోండా)లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన గడ్డం రమేశ్, కడమంచి సమ్మయ్య బైక్‌లను ఇంటి ముందు నిలపగా చోరీకి గురయ్యాయని బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

సామూహిక కుంకుమ పూజలు



కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న బొడ్రాయి సహిత విగ్రహ ప్రతిష్ఠాపన, పోచమ్మ కొలుపు ఉత్సవాల్లో భాగంగా శనివారం కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు. కుంకుమ పూజకు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చందర్

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకూ సాగునీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, రైతుల సంక్షేమమే బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మండలంలోని కుక్కలగూడూర్ గ్రామశివారులోని బండలవాగు చెరువు మరమ్మతు పనులను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ నుంచి బండలవాగు చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందిస్తామన్నారు. తూముల మరమ్మతుకు రూ.16లక్షల నిధులు విడుదలైనట్లు తెలిపారు. రామగుండం నియోజకవర్గం పరిధిలోని 20వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.80కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సంధ్యారాణి, వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, పుట్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, సర్పంచ్‌లు కొండ్ర చందర్, కోల లత, మల్లెత్తుల శ్రీనివాస్, జయ్యారం ఎంపీటీసీ గంగాధర రమేశ్, పార్టీ మండలాధ్యక్షుడు ఇంజపూరి నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ..

మండలంలోని కొత్తపల్లిలో ఇటీవల అమ్ముల సదయ్య చనిపోగా అతడి భార్య కవితను ఎమ్మెల్యే చందర్ శనివారం పరామర్శించారు. మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అదేవిధంగా అనారోగ్యంతో బాధపడుతున్న కుక్కలగూడూర్ మాజీ సర్పంచ్ బొంకూరి శంకర్ భార్య సునీతను ఎమ్మెల్యే పరామర్శించారు. వైద్యానికి అవసరమైన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

పాలకుర్తి: మిల్లర్లు కోతల పేరుతో రైతులను వేధిస్తే చర్యలు తప్పవని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే శనివారం సందర్శించారు. రైతులు ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవించారు. మిల్లర్లు తాలు, తరుగు పేరిట కోతలు విధిస్తున్నారని, క్వింటాల్‌కు దాదాపు 5 నుంచి 10కిలోల వరకు తరుగు పేరిట దోచుకుంటున్నారని తెలిపారు. స్పందించిన ఎమ్మెల్యే ఫోన్లో మిల్లర్లతో మాట్లాడారు. రైతులను తరుగు పేరిట వేధించడం సరికాదన్నారు. వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, పుట్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లం రాజయ్య, పార్టీ మండలాధ్యక్షుడు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

'ట్రిపుల్ ఆర్' తనిఖీ



డివిజన్‌లో తనిఖీ చేస్తున్న కమిషనర్ సుమన్‌రావు

కోల్‌సిటీ: కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్వచ్ఛ సర్వేక్షణ్–2023లో భాగంగా 'మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ్ షెహర్' పేరుతో చేపట్టిన కార్యక్రమాన్ని రామగుండం నగరపాలక సంస్థలో శనివారం నుంచి ప్రారంభించారు. ఇంటినుంచి వచ్చే పొడిచెత్తను ట్రిపుల్ ఆర్ కేంద్రాలకు తరలించడానికి ఏర్పాటు చేసిన కేంద్రాలను శనివారం మున్సిపల్ కమిషనర్ బి.సుమన్‌రావు పరిశీలించారు. అలగే పలు డివిజన్లలో పొడి చెత్త సేకరిస్తున్న తీరును తనిఖీ చేశారు. పలు కుటుంబాలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్యాం, సూపర్‌వైజర్ ఆడెపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు



తనిఖీ చేస్తున్న జూలపల్లి ఎస్సై, ఏవో

ఎలిగేడు: విత్తన సీడ్ దుకాణాల్లో నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తప్పవని జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ, ఎలిగేడు మండల వ్యవసాయశాఖ అధికారి ఉమాపతి అన్నారు. ఎలిగేడు మండల కేంద్రంలోని రాఘవేంద్ర, శ్రీసాయి సీడ్ విత్తన దుకాణాలను శనివారం మండల టాస్క్‌ఫోర్ టీం తనిఖీ చేశారు. విత్తన దుకాణాలలో విత్తనాలను, సంబంధిత పత్రాలను, స్టాకు రిజిష్టర్లు, బిల్లు బుక్కులను తనిఖీ చేసి పరిశీలించారు. వ్యవసాయశాఖ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్‌లో..

కాల్వశ్రీరాంపూర్: సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ వ్యాపారులు నకిలీ విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్ వ్యాపారులను హెచ్చరించారు. మండల కేంద్రంలో పలు విత్తన, పురుగుమందుల దుకాణాలను శనివారం పోలీసులు, వ్యవసాయ శాఖాధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్, ఏవో నాగార్జున, ఏఈవోలు రాజు, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, పూర్ణచందర్ పాల్గొన్నారు.

జూలపల్లిలో..

జూలపల్లి: జూలపల్లిలోని ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల విక్రయ దుకాణాలను ఎస్సై వెంకటకృష్ణ, మండల వ్యవసాధికారి ప్రత్యూష తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మందులను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పత్రాలను పరిశీలించారు. తనిఖీల్లో వ్యవసాయ శాఖ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నాణ్యమైన వైద్యసేవలకే జన ఆరోగ్య సమితి కమిటీలు



సమావేశంలో పాల్గొన్న ఎంపీపీ రమాదేవి

జూలపల్లి: గ్రామీణ పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకే జన ఆరోగ్య సమితి కమిటీలను నియమిస్తున్నట్లు మండల వైద్యాధికారి సంపత్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ కూసుకుంట్ల రమాదేవి అధ్యక్షతన శనివారం జేఏఎస్ వైద్య కమిటీల సమావేశం జరిగింది. వైద్యాధికారి సంపత్‌రెడ్డి మాట్లాడుతూ వడ్కాపూర్, వెంకట్రావుపల్లె, తెలుకుంట, పెద్దాపూర్ ఉప ఆరోగ్య కేంద్రాలు ఇక నుంచి వెల్‌నెస్ సెంటర్లుగా మారాయని చెప్పారు. సబ్ సెంటర్లలో హెల్త్ ప్రొవైడర్లను నియమించినట్లు పేర్కొన్నారు. తెలుకుంట అంజలి, వడ్కాపూర్ సుష్మిత, వెంకట్రావుపల్లెకు మాధవిని నియమించారు. సమావేశంలో ఎంపీడీవో వేణుగోపాలరావు, సీహెచ్‌వో కలీమొద్దీన్, హెచ్‌వీ వసంత పాల్గొన్నారు.

హోమం, కుంకుమ పూజలు



హోమంలో పాల్గొన్న భక్తులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఊశన్నపల్లె గ్రామంలో శనివారం గ్రామదేవతల మారుకొలుపు నిర్వహించారు. ఐడీసీ మాజీ చైర్మన్ ఈద శంకర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మహిళలు కుంకుమ పూజలు చేశారు. అర్చక పురోహితులు అంబరీష్ శర్మ హోమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వదించారు. సర్పంచ్ కొంకటి మల్లారెడ్డి, ఎంపీటీసీ మానస, ఉప సర్పంచ్ మేడి తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాన్ని వినియోగించుకోవాలి



సమావేశం నిర్వహిస్తున్న సర్పంచ్ పద్మ

కమాన్‌పూర్: రామగిరి మండలంలోని కల్వచర్ల ఆరోగ్య ఉప కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ గంట పద్మ–వెంకటరమణరెడ్డి అన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం జన ఆరోగ్య సమితి సమావేశాన్ని నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉంటూ వైద్యసేవలు అందిస్తున్నారని, ప్రజలకు ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే వచ్చి చూపించుకోవాలని కోరారు. ఎంఎల్‌హెచ్‌పీ దీరజ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో పూడికతీత



పనులను పరిశీలిస్తున్న ఎంపీవో

ఎలిగేడు: మండలంలోని రాములపల్లిలో ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, శివుపల్లి, నర్సాపూర్, నారాయణపల్లి గ్రామాల్లో ఎంపీవో అనిల్‌రెడ్డి శనివారం ప్రత్యేక పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. గ్రామాల్లో డ్రైనేజీల పూడికతీత, రోడ్ల వెంట చెత్త తొలగింపు, నర్సరీల్లో మొక్కల పెంపకం తీరును పరిశీలించారు. సలహాలు, సూచనలు చేశారు. సర్పంచ్‌లు దుగ్యాల శ్వేత, తంగెళ్ల స్వప్న, మాడ కొండాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్దతు ధర కల్పించేందుకే కొనుగోలు కేంద్రాలు



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దపల్లిరూరల్: రైతులు కష్టపడి పండించిన పంట దిగుబడికి మద్దతు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌యార్డు ఆవరణలో శనివారం డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం రైతు సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జెడ్పీటీసీ బండారి రామ్మూర్తి, నాయకులు జడల సురేందర్, శ్రీధర్, మొబిన్, శ్రీనివాస్, సంతోష్, రాములు, రంగయ్య ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

పెద్దపల్లి నియోజకవర్గంలోని 191 మంది లబ్ధిదారులకు శనివారం రూ.61.24లక్షల విలువగల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పంపిణీ చేశారు.

పల్లెల అభివృద్ధే ధ్యేయం

నియోజకవర్గంలోని గ్రామాల్లో కనీస వసతులు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. పెద్దపల్లి మండలం కొత్తపల్లిలో సీసీరోడ్డు, గౌడసంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు ప్రారంభించారు. జెడ్పీటీసీ రామ్మూర్తి, నాయకులు మర్కు లక్ష్మణ్, కలవేన స్వప్న, సర్పంచ్ చిలారపు సత్యం, ఎంపీటీసీ సాయికృష్ణ, మల్లేశం, సమ్మయ్య, రాజయ్య, కనకయ్య ఉన్నారు.

రైల్వేస్టేషన్‌లో పార్కింగ్‌కు అనుమతించాలి



కేంద్ర మంత్రిని సన్మానిస్తున్న ఆటో డ్రైవర్లు

గోదావరిఖని: రైల్వేస్టేషన్‌లో పార్కింగ్ కోసం అనుమతించాలని రామగుండం ఆటో డ్రైవర్లు కేంద్ర మంత్రి పరుషోత్తం రూపాలకు వినతిపత్రం అందించారు. రైల్వేస్టేషన్ అధికారులు పార్కింగ్ పేరిట రూ.2,500 వసూలు చేస్తున్నారని, దీంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఒక్కో ఆటోపై ఏడాదికి రూ.2,500 చొప్పున పార్కింగ్ ఫీజు వసూలు చేయడాన్ని నిలిపివేయాలని కోరారు. ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న 200 కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ మాజీ ఎంపీ వివేక్‌వెంకట్‌స్వామి ఆధ్వర్యంలో కేంద్ర మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఆటో డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎండీ రహీం, ప్రధాన కార్యదర్శి రాజేశ్ పాల్గొన్నారు.


హిందువులకు మాత్రమే ఎస్సీ సర్టిఫికెట్ జారీ చేయాలి

రామగుండం: భారత ప్రభుత్వం ఎస్సీ వారికి భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16(4), 17, 341 నిబంధనలకు అనుగుణంగా మెరుగైన ఉచిత విద్య, ఉపాధి, సంక్షేమం, అభ్యున్నతికి పాటుపడాలని, హిందువులకు మాత్రమే ఎస్సీ రిజర్వేషన్ సర్టిఫికెట్ జారీ చేయాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భుసిపాక సంతోష్ కోరారు. ఈ మేరకు శనివారం గోదావరిఖని పర్యటనకు వచ్చిన కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలకు వినతిపత్రం అందించారు. ఇటీవల అధిక సంఖ్యలో హిందూ మతం వీడి క్రైస్తవ మతం స్వీకరిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి ఎస్సీ ధృవీకరణ పత్రం రద్దు చేసి వారిని బీసీ–సీ జాబితాలో పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. మతం మారిన వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అనర్హులుగా ప్రకటించాలన్నారు. ఎస్సీలకు ధృవీకరణ పత్రం జారీ చేసే ముందు సంబంధిత రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి సదరు వ్యక్తి హిందూ మతంలోనే కొనసాగుతున్నట్లు గుర్తించి ఎస్సీ ధృవీకరణపత్రం జారీ చేయాలని కోరారు. సమితి ప్రతినిధులు ఈదునూరి చిరంజీవి, మిట్టపల్లి సతీశ్‌కుమార్, శ్రీకాంత్, ప్రణయ్, చింటూ, రాజేందర్, రమేశ్ ఉన్నారు.

కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ధర్మారం: రైతులు పండించిన వరిధాన్యాన్ని కటింగ్ లేకుండా కొనుగోలు చేయాలని ధర్మపురి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గజ్జెల స్వామి కోరారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం స్వామి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలు తెలిపారు. దీంతో పార్టీ నాయకులు కలెక్టర్ సంగీత సత్యనారాయణ, జిల్లా సివిల్ సప్లై అధికారిని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో పత్తిపాక ఎంపీటీసీ బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పాలకుర్తి రాజేశంగౌడ్, మాజీ ఎంపీటీసీ కమలాకర్‌రెడ్డి, నార మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న వైనాల రాజు

కమాన్‌పూర్: 22న మంథని నియోజకవర్గానికి వస్తున్న ఏఐసీసీ కార్యదర్శి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఏర్పాటు చేసిన ఘన స్వాగతం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ మండల అధక్షుడు వైనాల రాజు అన్నారు. మండల కేంద్రంలో శనివారం పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఇన్‌చార్జిగా వ్యవహరించి అక్కడ కాంగ్రెస్ గెలుపు కోసం కృషి చేసిన శ్రీధర్‌బాబుకు సబ్బితం నుంచి కమాన్‌పూర్ వరకు పెద్ద ఎత్తున స్వాగతం పలకాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తొట్ల తిరుపతియాదవ్, రంగు సత్యనారాయణ, భూంపెల్లి రాజయ్య, ఎంపీటీసీ శెవ్వ శంకరయ్య, సర్పంచ్ ఆకుల ఓదెలు, అశోక్, శంకర్, శ్రీనివాస్, నర్సగౌడ్ పాల్గొన్నారు.